## క్లుప్తంగా

### సురేష్‌ను పరామర్శించిన బూచేపల్లి



సురేష్‌ను పరామర్శిస్తున్న బూచేపల్లి

**సింగరాయకొండ:** ఆపరేషన్ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హైదరాబాద్‌లోని నివాసంలో పరామర్శించారు. ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

### రోగులకు పండ్లు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న చైర్మన్ గఫార్, నేతలు

**కనిగిరిరూరల్:** వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(సీఈసీ) మెంబర్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ మాజీ సభ్యులు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, సర్పంచ్ మారం రెడ్డి రవీంద్రారెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, ఎస్కే లతీఫ్, అమర్నాథ్‌రెడ్డి, తమ్మినేని ఫణీంద్రారెడ్డి, నారాయణస్వామి, రమేష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకటరెడ్డి, వెంకట్రావ్, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మురళీ, వేణుగోపాల్, వై సుబ్బారెడ్డి, కరీముల్లా, ఖాశీం, అచ్చాల శ్రీను, అంజి, నిరీక్షన్, అనీల్, సునీల్, డేవిడ్ పాల్గొన్నారు.

### ధర్నాను జయప్రదం చేయండి

**మద్దిపూడి:** ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మద్దిపూడిలో ఆదివారం మండల శాఖ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ అధ్యక్షతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీటీఎఫ్ నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఆర్ రమేష్ , ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, సునీత, సుబ్బారావు కార్యదర్శులుగా సాంబశివరావు, సుజాత, ఖాజావలి రమేష్, అశోక్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా కిషోర్‌కుమార్, సుబ్బారావు వెంకటరెడ్డి, కల్పన, సుబ్రహ్మణ్యం ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బాలచందర్ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, నాగరాజు, వెంకటేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శేషారావు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మండల శాఖ తరఫున సన్మానించారు.

### కోడిపందేల శిబిరంపై దాడి

- రూ.1,27,800 నగదు స్వాధీనం

**సింగరాయకొండ:** కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని పాకల పంచాయతీ పోతయ్యగారి పట్టపుపాలెం సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల సమాచారం ప్రకారం.ముందస్తు సమాచారం ప్రకారం శిబిరంపై దాడి చేసి సింగరాయకొండకు చెందిన కానాల వెంకటేష్, సుబ్బరాయుడు సత్రానికి చెందిన పేట జితేంద్ర, కందుకూరుకు చెందిన మరొక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టపుపాలెంకు చెందిన మత్స్యకారులు ఆధ్వర్యంలో కోడిపందేలు జరుగుతున్నాయని, వారు తప్పించుకొని పారిపోయారని తెలిపారు. దాడిలో రూ.1,27,800 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.



# జంకు బొంకు లేకుండా..

- కామేపల్లి పోలేరమ్మ తల్లి ఆలయం పక్కనే బెల్టుషాపు
- ఆలయం పక్కనే మద్యం విక్రయిస్తున్నా పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు
- కూటమి పాలనలో విచ్చలవిడిగా బెల్టుషాపులు
- పాలకులు, అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

జరుగుమల్లి(సింగరాయకొండ):

కూటమి ప్రభుత్వంలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. బడి, గుడి అన్న తేడా లేకుండా బహిరంగంగా ఏర్పాటు చేస్తున్నారు. అధికార పార్టీ నేతలే వీటిని ఏర్పాటు చేస్తుండటంతో అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో ఎక్కడో ఒక బెల్టుషాపు ఉండే పరిస్థితి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేజర్ పంచాయతీల్లో ఇష్టం వచ్చినట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు నిదర్శనం ఇటీవల జరుగుమల్లి మండలం కామేపల్లిలో పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మద్యం బెల్టుషాపు. జిల్లాలోనే కామేపల్లి పోలేరమ్మ తల్లి ఎంతో ప్రసిద్ధి. ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే ఈ ఆలయానికి అత్యంత సమీపంలో కేవలం కొన్ని మీటర్ల దూరంలో బెల్టుషాపు ఏర్పాటు చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ బెల్టుషాపు వద్దకు వచ్చే మందుబాబులతో ఇబ్బందులు పడుతున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు బహిరంగంగా మద్యం విక్రయించడమే కాకుండా అక్కడే మద్యం తాగేందుకు తాగునీరు అందజేస్తోంది. ఈ బెల్టుషాపులో ఆలయం పక్కనే బహిరంగంగా సాగుతున్నా ఎక్సైజ్, పోలీస్‌లు ఎవ్వరూ ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుడి పరిసర ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కామేపల్లి పోలేరమ్మతల్లి గుడి పక్కన బంకులో బహిరంగంగా మద్యం విక్రయిస్తున్న మహిళ

## విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



పూజల్లో మూలవిగ్రహ, ఉత్సవ విగ్రహమూర్తులు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

**పామూరు:** మండలంలోని తిరగలదిన్నెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఆదివారం రుత్వికులు రావినూతల రమేష్, కురిమేటి నరేంద్రల వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా గణపతి హోమం, లక్ష్మీ హోమం, రుద్రహోమం నిర్వహించారు. ప్రతిష్టా మూర్తులకు ప్రత్యేక పూజలు, జలాధివాసం, ధాన్యాదివాసం, వస్త్రాతివాసం నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## సురేష్‌ను సన్మానించిన డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి



సురేష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి

**సింగరాయకొండ:** వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకొని సత్కరించారు. తనకు పదవి రావటానికి సహకరించిన ఆదిమూలపు సురేష్‌కు, తనపై నమ్మకం ఉంచి ఎంపిక చేసిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఇటీవల ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న సురేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, చొప్పర వెంకన్న, వసంత్, మిట్టపాలెం ఉప సర్పంచ్ మండల మాల కొండయ్య, సుదర్శి వెంకట్రావు, సోమిశెట్టి సురేష్, షేక్ అల్లా, గంగాధర్, సురేష్ పాల్గొన్నారు.

# ఆంబోతు కాలువ ఆక్రమణ



ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలోని ఆంబోతువరవ కాలువను పూడ్చిన దృశ్యం

- చోద్యం చూస్తున్న అధికారులు
- కాలువ ఆక్రమణపై స్థానికుల మండిపాటు

**సింగరాయకొండ:** మండల కేంద్రంలోని బాలయోగినగర్, ఇండస్ట్రియల్ ఏరియా మధ్యలో ఉన్న ఆంబోతు కాలువను కొందరు ఆక్రమార్కులు ఆక్రమించి ఇళ్లనిర్మాణం చేపట్టడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు అక్రమార్కులు కాలువలు పూడ్చి ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తున్నారు. బాలయోగినగర్ మురికినీరు, ఇండస్ట్రియల్ ఏరియా నుంచి వచ్చే వ్యర్థాలు పోయేందుకు వీలుగా ఉన్న ఈ కాలువ ఇటీవల కాలంలో ఆక్రమణకు గురికాకుండా ఇప్పుడు ఏకంగా కాలువను పూడ్చి మరీ ఇళ్ల నిర్మాణం చేపట్టడం చర్చనీయాంశమైంది. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షం కురిసినప్పుడు నీరు ఈ కాలువ ద్వారా పాతసింగరాయకొండ పంచాయతీ ఊరచెరువు, బింగినపల్లి చెరువుకు చేరతాయి. ఇటీవల కాలంలో కాలువ ఆక్రమణకు గురవటంతో వర్షం నీరు చెరువులకు సక్రమంగా చేరటం లేదు. సుమారు 30 అడుగుల వెడల్పు ఉన్న పంటకాలువ ఆక్రమించి ఇళ్లనిర్మాణం చేపడుతుంటే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో ఆక్రమణలు తప్ప కాలువలకు రక్షణ లేకుండా పోయిందని, కావున పంట కాలువ ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

### డాగ్, బాంబ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు



సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**సింగరాయకొండ:** నియోజకవర్గంలోని టంగుటూరు, సింగరాయకొండ మండలాల పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్, దేవాలయాలు, ఐటీసీల వద్ద ఆదివారం పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సింగరాయకొండలో ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, టంగుటూరులో ఆర్టీసీ బస్టాండ్, ఐటీసీ వద్ద తనిఖీలు నిర్వహించారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సైలు బి.మహేంద్ర, నాగమల్లేశ్వరరావులు పాల్గొన్నారు.



టంగుటూరు ఆర్టీసీ బస్టాండ్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

## ప్రాణాలు పోతున్నా మంత్రికి పట్టదా..?

- కొండపి-అనకర్లపూడి రహదారిలో సీపీఎం నిరసన



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్

**కొండపి:** మండలంలోని కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో ప్రమాదాలు సంభవించి ఎంతో మంది మృత్యువాత పడుతున్నా మంత్రి స్వామికి పట్టడం లేదని సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ ధ్వజమెత్తారు. మండలంలోని కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో ఆదివారం సాయంత్రం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డులో పదుల సంఖ్యలో ప్రాణాలు పోవడానికి ప్రజాప్రతినిధులు కారణం కాదా అని ప్రశ్నించారు. రెండు కిలోమీటర్ల దూరం దాటేందుకు వాహనాలకు కనీసం 30 నిమిషాల సమయం పడుతుందంటే ఏ స్థాయిలో రహదారిలో గుంతలో ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఈ మార్గంలో ప్రమాదాలు పరిపాటిగా మారాయన్నారు. 1982లో కొండపి నుంచి మద్దులూరుకు తొలుత మెటల్ రోడ్డును వేశారని ఆ తర్వాత దీనిని తారు రోడ్డుగా మార్చారన్నారు. తారురోడ్డు కాస్త మట్టి రోడ్డుగా మారిపోయి గుంతలమయం కావడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే మంత్రి స్వామి ప్రభుత్వ అధికారుల స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రూబేన్, శివ,వెంకటరావు,ఆచారి, సుశీలమ్మ, కిరణ్ పాల్గొన్నారు.

### లారీ బోల్తా పడి ఇరువురికి గాయాలు

**వలేటివారిపాలెం:** అదుపుతప్పి లారీ బోల్తా పడిన ఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు.. నూజివీడు నుంచి మామిడి దుంగలు వేసుకొని బద్వేల్‌కు వెళ్తున్న లారీ అయ్యవారిపల్లి గ్రామానికి వెళ్తోంది. సరిగా 167–బీ హైవే వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. దీంతోలారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం అసుపత్రికి తరలించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదు

**టంగుటూరు:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని ఆలకూరపాడులో డ్రోన్ సహాయంతో చెరువు దగ్గర మద్యం తాగుతున్న వారిని ఎస్సై వి. నాగమల్లేశ్వరరావు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదన్నారు.

**మద్దిపూడి:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేష్‌బాబు హెచ్చరించారు. మద్దిపూడిలోని మహాలక్ష్మీ పెట్రోల్‌బంక్ వద్ద ఆయన పలు వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. పోలీస్‌ల నిబంధనలను అతిక్రమిస్తే జైలుకు పంపుతామన్నారు. ద్విచక్ర వాహనాదారుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని వాహనాదారులకు ఆయన సూచించారు.



ఆలకూరపాడులో మందుబాబులను హెచ్చరిస్తున్న ఎస్సై

## 80 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత

**జరుగుమల్లి(సింగరాయకొండ):** జరుగుమల్లి నుంచి అక్రమంగా తరలిస్తున్న 80 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. మండలంలోని పలు గ్రామాల నుంచి బియ్యాన్ని సేకరించి బొలేరో వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని కావలి వైపు తరలిస్తున్నారని, ఎక్కడికి తరలిస్తున్నారో విచారణలో తేలుతుందన్నారు. బొలేరో డ్రైవర్ కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నామని, వాహనం కూడా కావలి కి చెందిన కొండయ్య అనే వ్యక్తిదని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



సింగరాయకొండ-జరుగుమల్లి పోలీసులు పట్టుకున్న రేషన్‌బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనం

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**టంగుటూరు:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కమిటీ మెంబర్లు శ్రీను, రంగనాథ్, మురళి, శ్రీను, జయ, పద్మ, పావణి, కళ్యాణి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

**సీఎస్‌పురం(పామూరు):** ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం స్వామి అభిషేక సేవ, విశిష్టపూజలు అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణగాంచి స్వామికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, సింగిల్‌విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, మన్నేపల్లి కార్తీక్, భక్తులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకే సమాజాన్ని మార్చే శక్తి



టీచర్లను సన్మానిస్తున్న జేవీవీ నాయకులు

**కనిగిరిరూరల్:** సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకే ఉందని జన విజ్ఞాన వేదిక జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డాక్టర్ గురుబ్రహ్మం యోగా కేంద్రంలో టీచర్లకు 'మా మంచి మాస్టారు' అనే నినాదంతో ఉత్తమ అవార్డు గ్రహీత టీచర్లను సన్మానించారు. అనంతరం జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్కే గయాజ్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరావు, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని మంచి మార్గం వైపు నడిపించ గలిగే శక్తి గురువులకే ఉందన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ మాజీ సభ్యులు, జేవీవీ నాయకులు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో సమాజ హితాన్ని కోరే అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శ్రీనివాసరావు, చిన్నాజీ, న్యాయవాది చప్పరపు వాసు, బ్రహ్మారెడ్డి, కేవీ రమణారెడ్డి, ఆర్‌వీఎస్ ఆదినారాయణ, భాస్కర్,నారాయణ, కొండమ్మ, మధు, ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ జి.సంజీవి ఆరు మండలాల జేవీవీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి కొండ్రెడ్డి రచించిన విలయ గీతిక పుస్తకాన్ని జేవీవీ నాయకులు ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని 40 మంది ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు.

### 35 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షల చేస్తున్నడాక్టర్ కంకణాల కృష్ణమోహన్

**కొండపి:** మండలంలోని కట్టావారిపాలెంలో మన ఊరి ఆరోగ్య వికాసం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 35 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు దేవి ఆసుపత్రి డాక్టర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమన్నారు. ధ్యానం, యోగ వంటివి సాధన చేస్తూ ప్రశాంత జీవితం అలవాటు చేసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక రోగులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ, మందులు వాడటం ముఖ్యమన్నారు. గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ల చెంచయ్య, వీరమోసు మస్తాన్, మానికొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### 14 మంది జూదరుల అరెస్టు

**కనిగిరిరూరల్:** మండలంలోని ఎడవల్లి గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 14 మంది వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.11,470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

**సింగరాయకొండ:** మండలంలోని పాకల పంచాయతీ ఎస్సీ కాలనీలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు.